క్లుప్తంగా

కనకదుర్గ అమ్మవారికి పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భాద్రపద పూర్ణమి సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అలయ అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. నిర్వాహకులు పండుగ రాజేశ్వర్, పండుగ బుచ్చయ్య, భక్తులు పండుగ పర్శరాజు, రాజేందర్, రాములు, కనకయ్య, వికాస్, కొమురయ్య పాల్గొన్నారు.

పనివేళల్లో మార్పు చేయాలి



జనగామ రూరల్: గురుకుల పాఠశాలల్లో పనివేళలు శాస్త్రీంగా లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పని వేళల్లో మార్పులు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యూటీఎఫ్ గురుకులం జాక్ ఆధ్వర్యంలో పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, పెంబర్తి బాలిక, బాలుర పాఠశాల, కళాశాలల్లో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు విధులకు హాజరై నిరసన తెలిపారు. హెచ్‌ఎంలు అనిత, చంద్రమౌళి, కృష్ణ, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, కిషన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



జఫర్‌గఢ్: గ్రామ స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు పాటుపడాలని జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొరుకొప్పుల నాగేష్‌గౌడ్, ఎండీ వలిపాష, బుర్ర తిరుపతిగౌడ్, బుర్ర స్వప్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మానవతా విలువలు, పలు సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం పద్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త, ఉత్తమ అవార్డు గ్రహీత బంకా మాణిక్యరావు పాల్గొని మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులు మానవతా విలువలను పాటిస్తూ, ఎంచుకున్న లక్ష్యం వైపు మనస్సును కేంద్రీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. అప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు.

'ఆగడాలపై ఆధారాలుంటే చర్చకు సిద్ధం'



దేవరుప్పుల: మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆగడాలపై బీఆర్‌ఎస్ నాయకులు తగు ఆధారాలతో ముందుకొస్తే తాము చర్చకు సిద్ధమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఝాన్సీరెడ్డి వ్యక్తిగత సహాయకులు విజయేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిల తోపాటు పీఏ మనోభావాలను దెబ్బతీసేలా నిరాధరణ ఆరోపణలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుచేస్తే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి తాము వెనుకంజ వేయమన్నారు. పీఏ విజయేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై పరువు నష్టం కేసు పెడుతన్నట్టు పేర్కొన్నారు. సీనియర్ నాయకులు ఉప్పుల సురేష్‌బాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శుల ధర్మారెడ్డి, పాండు కృష్ణ, ఓడపల్లి రవీందర్, రసూల్, వంగ దశరథ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మండల అధ్యక్షులు నాగరాజు, సజ్జన్, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేసి ఇటీవల గెజిటెడ్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందిన హిమ్మత్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగు జయప్రకాశ్ చికెన్‌తో అతిథి భోజనాన్ని బుధవారం అందించారు. కాగా, ఇదే పాఠశాలలో పనిచేసి ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు మంజుల, కొండ రవి, సునీతాదేవి, శ్రీనివాస్‌రావు, కవిత, శశికళలు విద్యార్థులకు రూ.18 వేల విలువ చేసే క్రీడా కిట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. హెచ్‌ఎం షరోన్, కృష్ణమోహన్, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి



లింగాలఘణపురం: మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, అంగన్‌వాడీలు తదితరులు

లింగాలఘణపురం: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఐకేపీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని, ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో పాత డబ్బాలు, సీసాలు, కొబ్బరి బొండాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీఒక్కరు తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు అంటూ వేడుకలు జరుపుకొనే సమయంలో తప్పకుండా మొక్కలు నాటాలని కోరారు. ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ విద్యారాణి, పీఎస్ హెడ్మాస్టర్ మార్తా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి: ఆస్పత్రిలో శ్రమదానం చేస్తున్న ఎంపీడీఓ రాములు తదితరులు

పాలకుర్తిలో..

పాలకుర్తి: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏపీజీవీబీ ఆధ్వర్యంలో పాలకుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు పాల్గొని శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుకోలని అన్నారు. బ్యాంకు మేనేజర్ సమీర్ కుమార్, పసులాది ప్రశాంతి, బీరెల్లి రవివర్మ, చాట్ల శ్రీను, భరత్ తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: కట్కూర్‌లో..

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో శ్రమదానం, విద్యార్థులతో మానవహారం, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రామాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి ర్యాలీ తీశారు. అనంతరం క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌లో రైతుల సాగునీటి కష్టాలు తీర్చి పంట పొలాలకు సాగునీరు అందిస్తున్నందుకు కృతజ్ఞతగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు నీల గట్టయ్య ఆధ్వర్యంలో రైతులు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీకి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ మత్తడి రెండో తూము వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీల గట్టయ్య మాట్లాడారు. రెండో తూము మరమ్మతుకు నోచుకోకపోవడంతో దాదాపు పదేళ్లుగా సాగు నీరు లేక రైతులు ఇబ్బంది పడ్డారని, కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నీటిపారుదల శాఖపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేశారన్నారు. రెండో తూము వద్ద పనులకు ఎస్టిమేషన్ వేయించి కేవలం రెండు నెలల్లో పనులను పూర్తి చేయించారని, దాంతో దాదాపు 600 ఎకరాలకు సాగునీరు అందుతున్నాయన్నారు. ఈ విషయమై రైతులందరూ కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో రైతులు నీల రాజు, చుక్క చేరాలు, గోనెల రాజు, పొన్నం రాజయ్య, గోనెల యాదగిరి, రవి, చెట్కూరి రవి, మాతంగి వెంకటయ్య, నీరటి నర్సయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఎన్‌ఓ నరసింహరావు

జఫర్‌గఢ్: విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఎన్‌ఓ నరసింహరావు, ఏఎంఓ శ్రీనివాస్ కోరారు. మండలంలోని తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్, ఉపాధ్యాయులు నవీన్‌రెడ్డి, వేణు, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

రఘునాథపల్లి/కొడకండ్ల/బచ్చన్నపేట: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఎంపీడీఓ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు గార్లపాటి శ్రీనివాసులు, నాగశేషాద్రిసూరి, మల్లికార్జున్ తెలిపారు. బుధవారం వారు వేర్వేరుగా మాట్లాడారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగే సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.


వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ రాక..

జనగామ రూరల్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ గురువారం జనగామ వస్తున్నారని నిర్వాహకుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమంలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ అధ్యక్షుడు రావడం చాలా ఆనందదాయకమని గట్టు వెంకటేశ్వర్లు, పడకండి రవీందర్, డాక్టర్ మాధవ్‌శెట్టి వరూధిని తెలిపారు.

సాహితీమూర్తుల చిత్రపటాల అందజేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల తెలుగు టీచర్ ఎస్.బి.లక్ష్మీనర్సమ్మ సాహితీమూర్తుల చిత్రపటాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామ జ్ఞాపకార్థం కవుల చిత్రపటాలను అందించినట్లు తెలిపారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



లడ్డూతో భక్తుడు తిరుపతి

స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ రూరల్/పాలకుర్తి టౌన్/రఘునాథపల్లి/చిల్పూరు: వినాయక నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శివునిపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి నిర్వహించిన గణపయ్య లడ్డూను భక్తులు గుర్రాల తిరుపతి, అర్చన దంపతులు రూ.1,28,116లకు వేలంలో దక్కించుకున్నారు. అలాగే జనగామ పట్టణంలోని బీరప్పగడ్డలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూను పనికరం అశోక్ వేలంలో రూ.25వేలకు దక్కించుకున్నారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో బ్యాంక్‌స్ట్రీట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ప్రారంభించారు. అనంతరం గణనాథులను భక్తిశ్రద్ధలతో ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం చేశారు.

పౌష్టికాహారం అందించాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను వారు తనిఖీ చేశారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్ కుమారుడు రిక్కి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డాక్టర్ నజీర్‌లు మంగళవారం రాత్రి రాజేందర్‌ను పరామర్శించారు. అలాగే బుధవారం బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మనోజ్‌రెడ్డి, అరూరి రమేశ్ తదితరులు రాజేందర్‌ను పరామర్శించారు.

వైద్యశిబిరం

చిల్పూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్ అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలో బుధవారం వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా మాజీ సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. స్నేహ, డాక్టర్లు రాజేష్, పావనికుమారి, శరవణిభవ, వెంకటేశ్వర్లు, అక్షయ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు నమిలిగొండలో ఉన్న ప్రభుత్వ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఘన్‌పూర్ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ బదిలీపై జఫర్‌గఢ్‌కు వెళ్లగా కరీంనగర్ జిల్లా వీణవంక నుంచి బదిలీపై ఘన్‌పూర్‌కు వేణుగోపాల్‌రెడ్డి వచ్చారు.

అంగన్‌వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: అంగన్‌వాడీల సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ సుమన్ కోరారు. మండలంలోని కూనూర్, రఘునాథ్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ సుమన్ హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటూ కృషి చేస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని నీర్మాలలో తెలంగాణ ఉద్యమకారుడు కూతాటి నర్సింహులు, చౌడూరులో బీఆర్‌ఎస్ నాయకుడు మూల రవి అనారోగ్యానికి గురికాగా వారిని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేపథ్యం కలిగిన బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై త్వరలో ప్రజాస్వామ్య యుత ఆందోళనలు చేపడుతుందన్నారు.

కేసు నమోదు

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బక్కం వరుణ్‌సందీప్ తీవ్ర అస్వస్థకు గురైన విషయంలో బాధితుడి తండ్రి కరుణాకర్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రామ్‌చరణ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు.. ఈ నెల 16న తిమ్మాపూర్‌లో గణేశ్ నిమజ్జనంలో పెంతల రాజకుమార్, పెంతల మహేష్‌లు బక్కం వరుణ్‌సందీప్‌కు థమ్సప్ కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి తాగించడంతో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. ఇది తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు చికిత్స నిమిత్తం తరలించారు. వరుణ్‌సందీప్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో దీనికి కారకులైన రాజ్‌కుమార్, మహేష్‌పై చర్యలు తీసుకోవాలని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

దేవరుప్పుల: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రగాయాలపాలైన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన నాతి అంజయ్యగౌడ్ రోజువారి కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి పడగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం



జనగామ: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ/కొడకండ్ల/బచ్చన్నపేట/పాలకుర్తిటౌన్/దేవరుప్పుల: ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీని చంపేస్తామని మాట్లాడిన బీజేపీ, శివసేన నేతలను వెంటనే అరెస్ట్ చేయని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని జనగామ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గనిపాక మహేందర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే తన్వీందర్ సింగ్, మహారాష్ట్ర శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ దిష్టి బొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ బయటకు వస్తే చంపేస్తారని బీజేపీ నేత తన్వీవిందర్ సింగ్, నాలుక నరికి తీసుకు వస్తే రూ.11లక్షలు ఇస్తామని శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ప్రకటన చేయడం ఏంటన్నారు. ఈ విషయాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకోకపోతే ఊరుకునేది లేదన్నారు. సర్వల నర్సింగారావు, ఎర్రమల్ల సుధాకర్, కంచె రాములు, చింతకింది మల్లేష్, చిర్ర సత్య నారాయణరెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, ముస్త్యాల చందర్, జాయ మల్లేష్, దాసరి శేఖర్ యాదవ్ తదితరులు ఉన్నారు. అలాగే కొడకండ్ల, బచ్చన్నపేట, పాలకుర్తి, దేవరుప్పుల మండల కేంద్రాల్లో రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తన్వీందర్‌సింగ్, సంజయ్‌గైక్వాడ్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ధరావత్ సురేష్‌నాయక్, మాసపేట రవీందర్‌రెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, యాకసోమయ్య, ఆదినారాయణ, యాకాంతరావు, రాపాక సత్యనారాయణ, భిక్షపతి, యాకేష్‌యాదవ్, రాము, దాచేపల్లి నర్సింగారావు, రాజయ్య, జంగిటి నరేష్, నిడిగొండ శ్రీనివాస్, ఎల్లయ్య, రమేష్, గాలి కృష్ణ పాల్గొన్నారు.

రేపు ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

జనగామ రూరల్: జనగామ మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసేందుకు వివిధ కేటగిరీలకు సంబంధించిన ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గోపాల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపాధికన వేతనంతో కూడిన ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా డిపార్ట్‌మెంట్లలో ల్యాబ్ అటెండెంట్-15, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్-03, దోభీ (ప్యాకర్స్)- 04, ఈసీజీ స్కాన్ టెక్నీషియన్-02, అనస్థీషియా టెక్నీషియన్-04, ఎలక్ట్రీషియన్-02, ప్లంబర్-01, డ్రైవర్- 01, థియేటర్ అసిస్టెంట్-02, గ్యాస్ ఆపరేటర్ (ఆక్సిజన్)-02, వార్డ్ బాయ్స్-04 ఖాళీలు ఉన్నాయన్నారు. చంపక్ హిల్స్‌లోని ఎంసీహెచ్ రెండో అంతస్తులో ప్రిన్సిపల్ కార్యాలయం నందు 20వ తేదీ ఒక్కరోజు మాత్రమే ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత సమాచారం డౌన్‌లోడ్ చేసుకుని అర్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, స్వీయ ధ్రువీకరణతో పాటు ఎస్సీ, ఎస్టీలు రూ.100 ఇతరులు రూ. 200, పీహెచ్‌సీ అభ్యర్థులు ఎటువంటి రుసుము లేకుండా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

23న అవగాహన సదస్సు

జనగామ రూరల్: జిల్లాలోని అన్ని టెలిఫోన్ ఎక్స్‌చేంజీల పరిధిలోని ల్యాండ్ లైన్, బ్రాడ్ బ్యాండ్, ఫైబర్ టు హోం, మొబైల్ వినియోగదారులకు ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు ఎక్స్‌చేంజ్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ జనగామ సబ్ డివిజనల్ అధికారి చంద్రగిరి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులకు మొబైల్ రేడియేషన్, సైబర్ నేరాలు, నకిలీ కాల్స్, సందేశాలపై అవగాహన ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే పలు అంశాలపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



బచ్చన్నపేట: రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి



రఘునాథపల్లి: పోషణ మాసోత్సవంలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి అన్నారు. మండలంలోని కొడవటూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే విద్యార్థుల హాజరు, పౌష్టికాహారం పంపిణీ వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనోహర, డాక్టర్ ఝాన్సీ, హెచ్‌ఎం రాజశ్రీ, ఏఎన్‌ఎం సునంద, పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలక్ష్మి, శ్యామల, ఆశ వర్కర్లు అనిత, అనూష ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం..

రఘునాథపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరి, అండాలు అన్నారు. మండలంలోని భాంజీపేట, కోమల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా భుజించాలని, ఇళ్లల్లో సైతం బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కోమల్లలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పంచాయతీ కార్యదర్శి త్రివేని, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, సుప్రియ, పాతిమబేగం తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: అన్నప్రాసన చేస్తున్న టీచర్లు

చిన్నారులకు అన్నప్రాసనం

దేవరుప్పుల: పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని చిన్నమడూరు, పడమటితండా(డీ) తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, రామతార, నర్సమ్మ, లలిత, ఆరోగ్య సిబ్బంది, మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో నష్టం



పత్రాలను అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

జనగామ: ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి నష్టం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 20 వార్డు కమర్షియల్ ఏరియాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లపై దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం వార్డులో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను సేకరించి స్వచ్ఛత నెలకొనేలా చూశారు. అంతకు ముందు మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం, వార్డు ఆఫీసర్ మల్లిగారి మధు, కాల నీవాసులు తదితరులు ఉన్నారు.

లక్కీడ్రాలో 25కిలోల లడ్డూ



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన ఇమ్మడిశెట్టి కనకరాజుకు వేములవాడలో తీసుకున్న రూ. 50 కూపన్‌కు 25 కిలోల లడ్డూ వరించింది. వివరాలిలా ఉన్నాయి.. కనకరాజు ఈ నెల 14న కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడకు వెళ్లారు. రాజరాజేశ్వరస్వామిని దర్శనం చేసుకున్న అనంతరం బద్ది పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. అక్కడే గణేశ్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద 25కేజీల లడ్డూ లక్కీ డ్రా కూపన్లు జారీ చేస్తున్నారు. దీంతో కనకరాజు రూ.50 కూపన్లు రెండు తీసుకున్నారు. అనంతరం అక్కడి నిర్వాహకులు డ్రా తీయగా కనకరాజు పేరు రావడంతో ఫోన్‌లో సమాచారం అందించారు. బుధవారం కనకరాజు వేములవాడకు చేరుకొని 25కిలోల లడ్డూతో ఇంటికి చేరుకున్నాడు. వేములవాడ రాజన్న కృపతోనే తనకు లక్కీ డ్రాలో 25 కేజీల లడ్డూ వరించిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఇన్సులేటర్ పగిలి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ రోడ్డులోని ఎస్‌ఎస్ 12కు చెందిన100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేటర్ పగిలి దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎగిసిపడిన మంటలతో ట్రాన్స్‌ఫార్మర్‌లోని 200 లీటర్ల అయిల్ బుగ్గిపాలైంది. స్థానికుల కథనం ప్రకారం.. రఘునాథపల్లి సబ్‌స్టేషన్ నుంచి దాసన్నగూడెం ఫీడర్ ద్వారా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండగా దీనికింద 18 వ్యవసాయ బోరు బావుల కలెక్షన్లు ఉన్నాయి. మధ్యాహ్న 11 కేవీ తీగల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా అందించే ఇన్సులేటర్ ఒక్కసారిగి పగిలిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు తొడిగిన పీవీసీ పైపులకు మంటలు అంటుకుని ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌కు వ్యాపించాయి. దీంతో మంటలు ఎగిసిపడి 200 లీటర్ల అయిల్ బుగ్గిపాలైంది. ఆ సమయంలో అక్కడ రైతులు ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఏఈ రాహుల్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని రైతుల సహకారంతో మంటలను ఆర్పారు. ఈ విషయమై ఏఈ రాహుల్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓవర్ లోడ్ సమస్య లేదని, ఇన్సులేటర్ పగలడంతో మంటలు వ్యాపించి ట్రాన్స్‌ఫార్మర్‌లోని అయిల్ పూర్తిగా కాలిపోయిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తామన్నారు.

చిన్న మడూరు ధృవ ప్రాజెక్టుపై అధికారుల కొరడా



హద్దు రాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

దేవరుప్పుల: చాపకింద నీరులా కొనసాగుతున్న ఓ రియల్ ఎస్టేట్ అక్రమ లే ఔట్ వెంచర్‌పై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించి హద్దు రాళ్లను తొలగించిన సంఘటన బుధవారం చిన్నమడూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే .. మండలంలోని చిన్నమడూరు రెవెన్యూ పరిధి గ్రామ శివారులో 15,18,26 సర్వే నంబర్‌లో సుమారు 35 ఎకరాల్లో హైదరాబాద్‌కు చెందిన ధృవ ప్రాజెక్టు నిర్వాహకులు రెండేళ్ల కిందటనే ఫామ్‌హౌజ్ పేరిట చుట్టూ ప్రహరీ కట్టి ప్లాట్లను చేశారు. హైదరాబాద్ వంటి నగరాలకు చెందిన ఆసక్తి కలిగిన కొందరికి ఒక గుంట నుంచి పది గుంటల వరకూ విక్రయించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టులోని వ్యాపారుల మధ్య చోటుచేకున్న వివాదాలతో తాత్కాలికంగా రియల్ దందాకు బ్రేక్ పడింది. వివాదం అధికార కాంగ్రెస్ చేతికెళ్లి పెద్దఎత్తున ఆర్థిక లావాదేవీలు కొనసాగాయన్న ఆరోపణ క్రమంలో కిడ్నాప్‌ల పర్వం జరిగిందన్న దుమారం లేచింది. ఈ విషయమై బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై ఆరోపణల నేపథ్యంలో పోలీసులు, తహసీల్, పంచాయతీ అధికారులు బుధవారం రంగంలోకి దిగారు. జనగామ ఆర్డీఓ కొమురయ్య పర్యవేక్షణలో చిన్నమడూరులోని అక్రమ లేఅవుట్ వెంచర్‌లోని హద్దు రాళ్లను తొలగించి గేటు వద్ద.. ఇట్టి భూములు అమ్మడం, కొనడం నిషేధమని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఎంపీఓ టి.సురేష్‌కుమార్, ఎస్సై ఊర సృజన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, ఆంధ్రయ్య, సర్వేయర్ అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.